

# వైరస్

ఎమ్వీ రామిరెడ్డి

డామిట్... మళ్లీ ఫోన్... ప్రతి ఒక్కడికీ ఇదో ఫ్యాషనైపోయింది మాట్లాడితే ఫోను. మనిషెంత బద్ధకస్తుడైపోయాడు? కడుపులో చల్ల కదలకూడదు. కబురు మాత్రం తీరం చేరాలి. ఎవర్ననుకొని ఏం లాభం? అసలు నేరగాడు గ్రాహంబెల్!

హలో.. కట్టయింది. టెలికం నిర్వాకం. ఉన్న ఫోన్లు మోగి చావవుగానీ... వెధవ స్కీములొకటి! నూకలు పెడతావా- మేకలు కాస్తాను. వెయ్యి రూపాయలిస్తావా- ఫోను పెడతాను. పిచ్చి జనం. వేలంవెర్రిగా దరఖాస్తులు. తిక్క కుదిరింది. గడువు ముగిశాక టెలికాంగాడు 'తూచ్' అన్నాడు. కనెక్షన్ ఇచ్చేటపుడు ఇంకో వెయ్యి కట్టాల్సిందేనన్నాడు. ఫోన్ నా ఇష్టం వచ్చినపుడు ఇస్తాను పొమ్మన్నాడు.

మళ్లీ ఫోను మోత! అబ్బబ్బ... తల వాచిపోతోంది. వాచిపోతోంది తలా? మెదడా? మెదడే. మెదడు వాపే!

"హలో హాస్పిటలైజ్డా? పదిమందా? బయల్దేరుతున్నా."

వీడొకడు. ఈ ప్రభుత్వాసుపత్రిని తానే కట్టించినట్టు గేటు దగ్గరే తిష్టవేసి డబ్బులివ్వందేలోనికి పోనివ్వడు. రేయి ఫూల్... నేను డెయిలీ కష్టమర్నిరా! నీకెందుకు గుర్తుంటుంది? జర్నలిస్టుని కూడా డబ్బు డిమాండ్ చేయటం నీకొక్కడికే చెల్లింది.

ఆస్పత్రి కాంపౌండ్ అడుగుపెట్టగానే భరించలేని కంపు. దుర్వాసన. మందులు కుళ్లి పోయాయేమో? కాదు కాదు శవాలు కుళ్లిపోయాయేమో? అంతే అయ్యుంటుంది. కుళ్లిపోవడానికీ, మురిగిపోవడానికీ మందులెక్కడ చచ్చాయ్. ప్రజల కోసమని ప్రభుత్వం పంపిస్తున్న మందులు అట్నించి అటే ప్రైవేట్ మెడికల్ షాపులకు వెళ్తుంటే! 'దీనిమీద ఇన్వెస్టిగేటివ్ వార్త పేలేస్తానన్నావ్... ఇంకెప్పుడు?' ఈ డెస్క్ ఇన్‌ఛార్జికేం పనుండదు. ఎన్నిచ్చినా ఇంకో వార్త కావాలంటాడు. కూర్చొని ఫోన్ కొట్టడం కాదు తిరిగితే తెలుస్తుంది.

ఆహా! ఏమీ ఈ కారిడార్ సౌందర్యం? స్వీపర్లు ఎంతమంది ఉండుంటారు? సూపర్నెంటుగాడు ఇటెప్పుడూ రాడా? ఎందుకు రావాలీ? వచ్చి అనవసరంగా ఎందుకు వాంతించుకోవాలి.

'హలో.. హలో కాంపౌండర్... అరేయ్... నేనొస్తున్నా నువ్వక్కడే ఉండరా...' బాస్టర్డ్ వెళ్లిపోయాడు. నోటినిండా కిళ్లీ ఇరికించుకొని, కరాకరా నమిలి కారిడార్‌పై ఉయ్యడానికి వాడికి బుద్ధుండక్కర్లా? తమరెవరూ తల్లీ... పెద్ద బొచ్చెనిండా రకరకాల విసర్జితాల్ని తెచ్చి ఇక్కడ పడేస్తున్నారు? వరండా పక్కనే పెద్ద కందకం ఏదైనా ఉందనుకున్నావా? లేక మురిక్కాలవేదైనా ప్రవహిస్తోందనుకున్నావా?

ఇదిగో పెద్దాయనా- ఒక్క నిమిషం. ఒక్క నిమిషం... ఒక్క నిమిషం ఏడుపాపవయ్యా బాబూ! ఇప్పుడెందుకు శోకాలు పెడతావ్? ఈ ఆస్పత్రికి రాక ముందుండాలి బుద్ధి. ఇంతకీ విషయమేమిటి? పిచ్చివాడా! అంతేనా? అంత ఖర్చుపెట్టినోడివీ... ఇంకో బాకీ చేస్తే నీ సొమ్మేంబోయిందీ? వాడు మాత్రం ఎంతడిగాడు! ఆఫ్టరాల్ వంద రూపాయలు! అది కూడా ఇవ్వలేని నీ దౌర్బల్యాన్ని క్షమించేసి నీ కొడుకుని ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లాడు. కాకపోతే ఇంకో పేషంటును పడుకోబెట్టిన స్ట్రెచర్ పైనే నీ కొడుకునీ పడుకోబెట్టి తీస్కెల్లి లిఫ్టులో తోశాడు. మీవాడి ప్రారబ్ధం బావుండి

కాళ్లు కిందికి వేళ్లాడి... లిఫ్టుకీ గోడలకూ మధ్య పడి నలిగిపోయి చచ్చిపోయాడు.

వార్డంతా వాసన. పసిపిల్లల వాసన. పసిపిల్లల మెదళ్ల వాసన. పసిపిల్లల మెదళ్లు వాచిన వాసన. మెదళ్ల లోకి సైలైన్ బాటిళ్ల ప్రవాహం. వార్డు నిండా వాంతులు, విరేచనాల బీభత్సం, జీర్ణావస్థకు చేరిన ఇనుప మంచాల పై ఎక్కుపెట్టిన 'జ్వర' ఫిరంగులు.. పిల్లలు కాలిపోతు న్నారు. తల్లులు ఏడుస్తున్నారు. మృత్యువుతో బచ్చా లాడుకుంటున్న పిల్లల్ని చూసి రోదిస్తున్నారు. బాస్టర్డ్... అణువణువునా విషాద దుఃఖాలను పేర్చి ఈ వార్డు మయసభను సృష్టించేదెవడ్రా!

అమ్మలారా, ఏడవకండేడవకండి! వారంరోజులు గా ఈ వార్డు ఇదే వాసనతో కుళ్లిపోతోంది. మీ బిడ్డల మెదళ్ల మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. మీ చేతిలో చిల్లిగవ్వ లేకున్నా సరే రేపీపాటికి మీరిక్కడ ఉండరు. నిన్న పన్నెండు మెదళ్లు ఇదే వార్డులో శివ తాండవం చేశాయి. ఇవ్వాళ ఒక్కటీ లేదు. కొన్ని కైలాసానికీ, కొన్ని ప్రైవేటు ఆస్పత్రులకీ తెల్లారుజామునే ఉడాయించి ఉంటాయి.

ఆస్పత్రి వెనక విశాలమైన ఖాళీస్థలం. అడ్డదిడ్డం గా పెరిగిన పిచ్చిచెట్లు. పక్కనే చెత్తా చెదారం. వ్యర్థ పదార్థముల్లో రకములు ఎన్ని? అవి ఏవి? వాటి రూప సారంశమేమి? అనే అంశంపై ఎవడైనా డాక్టరేట్ చేస్తు న్నాడేమో? ఆహా! ఏమి నా భాగ్యం! చెత్తపక్కనే ఆస్పత్రి లోనూ మూడున్నర పందుల షికారు! ఎంతటి అద్భుత దృశ్యం! ఎక్కించు... ఎక్కించు... కెమెరాలోకి ఎక్కించు. షిట్- ఈ ఫోటోగ్రాఫర్ ఒకడు. సభలూ సన్మానాలంటే ఎగేసుకుపోతాడు. ఇక్కడికొచ్చి ఉంటే జీవితం పావనమై ఉండేది కదా! మరేం పర్లేదు... సాయంత్రం దాకా ఈ సీను స్టిల్ మారదుగాక మారదు. మార్చేసి మనకు ద్రోహం చేసేంత దుర్మార్గులెవ్వరూ ఇక్కడి సిబ్బందిలో ఉండరు గాక...

రేయ్....రేయ్.. ఎవడ్రా నువ్వు? ఎందుకలా తొల గిస్తావ్? అది మన వ్యవస్థరా. మన శారీరక నైసర్గిక స్వరూపంరా! వీళ్లెవరూ... నర్సులు, కాంపౌండర్లు, వార్డ్ బాయ్స్, డాక్టర్లు, క్లర్కులు... ఎందుకూ ఉరుకులు పరుగులు? ఆ క్యాండిడేట్‌ను ఎక్కడో చూశానే... ఆ సూపర్నెంటు! ఈ ఆసుపత్రికి పెద్దదిక్కు... అవును... పెద్దదిక్కెప్పుడూ ఎవ్వడికీ కనపడకుండా పెద్ద తరహాలో ఫోజులివ్వాలి కదా... సారీ ఇస్తాడుగదా... వీడు కూడా ప్యాంటు పైకి లాక్కుంటూ పరుగులు తీస్తున్నాడేమిటి?

కారిడార్లు కడుగుతున్నారు. ఫినాయిల్ కంపు... ఎప్పటిదిరా ఆ బాటిల్? అది ఫినాయిలా? పెట్రోలా? ఎప్పుడన్నా వాడి ఛస్తేగా! వార్డులు శుభ్రమవుతున్నాయ్.. చెత్త తీసేస్తున్నారు.. వరండా పక్కన మురిక్కాలవ క్లీన్.. ఏం పోయేకాలం వచ్చిందిరా మీకు?

ఉన్నట్టుండి ఇట్ట మారిపోయారేం? ఆరా దీయాలి. లేకుంటే అర్జెంటుగా పిచ్చెక్కుతుంది.

మంత్రిగారు ఆకస్మిక తనిఖీకి రాబోతున్నార్ట- అదీసంగతి! లేకుంటే మీరిట్లాంటి కీచకపర్వం లిఖి స్తారా? ప్రహసనం. ప్రహసనం... విలేఖర్లకు కబుర్లు... టీవీలకు ఫోన్లు. సర్వం సిద్ధం. మంత్రిగారి కోసం పండ్ల రసం దగ్గర్నుంచి పలావు ప్యాకెట్ల దాకా ఏర్పాట్లు.

నాటకానికి తెర లేచింది. చిన్నచిన్న పాత్రలొస్తు న్నాయ్. పోతున్నాయ్. ఎమ్మార్వో, ఎం.పి.డి.వో, ఆర్డీవో, ఆరోగ్యశాఖాధికారీ... హడావుడి తప్ప అసలు 'పోర్షన్' ఎవ్వడూ ఒప్పజెప్పటం లేదు. అసలు పాత్రధారి కోసం క్లైమాక్స్ సిద్ధం చేస్తున్నారు. 'అయ్యవారు' ఆఖర్న రంగ ప్రవేశం చేసి రససిద్ధి గావిస్తారు!

ఈలోగా కడుపులో ఎలుకల్ని కాల్చిపారేస్తే... అమ్మో! ఈలోగా క్లైమాక్స్ అయిపోతే? ఏడిశాడు... వాడి మొహం! ఎన్నిసార్లు అనుభవంలోకి రాలేదూ? జాగు వాడి జన్మహక్కు!

*

అయ్యవారు చెక్కర్లు కొట్టిన సమయాన్ని రికార్డు చేశానా? కాచి వడపోస్తే అరగంట కూడా అడుక్కి రాదు! ఇంతచేసి బాంబులెక్కడెక్కడ పేలాయో సమీక్షిస్తే... అందరి ముందూ వార్డ్‌బాయ్స్ మీద, అడపా దడపా కాంపౌండర్ల మీదా... విలేఖరుల ముందు సూపర్నెంటు మీదా... రక్తికట్టించే రసవత్తర సన్నివేశం మిగిలింది కదూ? మంత్రిగారు స్వయంగా మురికిగుంట శుభ్రం చేయటం! రెడీ... ఒన్... టూ... త్రీ... స్టార్ట్ కెమెరా... యాక్షన్... మంత్రిగారు స్వయంగా మురికిగుంట శుభ్రం చేస్తున్నారు. మాస్టారూ... మీరు ఫీల్డుకి కొత్తా? ఏ పత్రిక? అంతగా డెడ్‌క్లోజప్పులో ఫోటోలు తీయ కూడదు. మంత్రిగారి చేతికున్న గ్లౌజులు 'ఫ్లాష్' అవు తాయి. లాంగ్‌షాట్స్... మిడిల్‌షాట్స్.... తనివి తీరకపోతే ముఖం వరకూ క్లోజప్... దట్సాల్ ఇందుమూలంగా యావన్మంది పాత్రికేయులకు తెలియజేయునది ఏమ నగా... దొరికిపోయాం... ఈ ప్రెస్‌మీట్‌ల ప్రహసనాన్ని కనిపెట్టిన జర్నలిస్టెవరో ఆరా తియ్యాలి. జర్నలిజం

గురించి అన్ని కబుర్లు చెబుతాడు. డిమిట్రోవ్‌కు తెలియదా ఈ విషయం?

"...వ్యాధి నిరోధానికి అన్నిరకాల చర్యలూ తీసుకున్నాం... అధికారులందర్నీ అప్రమత్తం చేశాం..."

అరేయ్ శీనూ... ప్రెస్‌మీట్‌లో ముందు వరుసలో కూర్చోగానే సరికాదురా... వాడా మాట చెప్పగానే మాడు మీద ఒక్కటిచ్చుకోవద్దూ! నూటయాభైమంది చచ్చాక సకల జాగ్రత్తలూనా? ఆరేళ్ల నుంచీ ఇదే సీజన్‌లో వస్తోందని తెలుసుగా. ఆ ఏడుపేదో ముందుగానే ఏడిస్తే పోలా!

*

అద్భుతమైన మేకప్. ఫస్ట్‌పేజీ ఎంత ముద్దొస్తుందో విడుదలకు సిద్ధమైన సినిమా వాల్‌పోస్టర్‌లా! అచ్చు హీరోలాగే మంత్రిగారి స్టిల్ అద్దిరిపోతోంది. మురిగ్గుంటలో చేతుల్తో... కాదు కాదు.. గ్లౌజుల్తో!

పచ్చల పతకంలా కళకళలాడే పతాక శీర్షిక.

'మంత్రి ఆకస్మిక తనిఖీ - ఆస్పత్రి సిబ్బందిపై ఆగ్రహం.' అబద్ధం. అంతా పచ్చి మోసం. వార్తంతా ఒక ఆత్మవిద్రోహ నివేదిక. అయ్యవారు వస్తున్నట్లు ఆరు గంటల ముందే ఆస్పత్రికి కబురందితే ఆకస్మిక తనిఖీ ఏమిటీ నా బొంద! ఆపాటికా మంత్రిగారు హైదరాబాద్‌లోని ఖరీదైన సొంత భవనంలో ఇంకా నిద్రలేచి వుండరు. మరెందుకు దినుసులన్నీ పుష్కలంగా దట్టించి, వార్తనలా ఘుమఘుమలాడేలా వండావ్?

చుప్- మరీ భూతద్దాలన్నీ బైటికి తీయకు. సెన్సేషన్, సెన్సేషన్, వైవిధ్యం వృత్తిధర్మం.

*

ఇది ఆర్డీవో కార్యాలయమే గదా? రీసెంట్‌గా ఫైర్ యాక్సిడెంట్ ఏమైనా జరిగిందా? మరి అధికారులుగానీ, ఉద్యోగస్థులుగానీ ఎవ్వరూ కనిపించరేం? ఇవ్వాళ సండే కూడా కాదే!

'సండే కాకపోతే సాటర్‌డే కాదా?'

శనివారం, మూడో శనివారం, పిల్లలకు లీవ్ అండ్ రిలీవ్. పెద్దలకు క్లీన్ అండ్ గ్రీన్.

'పచ్చదనం-పరిశుభ్రత' కల సాకారానికి కదిలినారు అధికారులంతా. గ్రామసీమలకు, పోదము పదవే సద్గురు బ్రహ్మము సేవచేయవలె మనసా!

సాయంత్రానికల్లా స్పెషల్ ఫీచర్ సృష్టించాలి. అసలు మెదడువాపు వ్యాధి అనగానేమి? అది ఎలా సోకును? వ్యాధికారకమ్ములేవి? అవి ఎలా వ్యాప్తి చెందును? దుష్ఫలితములేవి? సచిత్ర కథనాలతో సమాధానమివ్వాలి.

అరుదుగా వచ్చే అవకాశం. స్పందించాలి. నిజంగా హృదయాన్ని పట్టి కుదపాలి. వ్యాధిపీడిత గ్రామసీమల్లోకి తొంగి చూడాలి. వికలమైన బతుకు బొమ్మల్ని పలకరించాలి.

వేదనాభరిత స్వరాల్ని రికార్డు చేయాలి.

*

"నా పేరు గుగులోతు బిచ్చి. యీడు నా కొడుకు గుగులోతు మాణిక్కెలాల్. మూడేండ్ల కింట మెదడు వాపు జబ్బు చేసింది. అంతకు ముందు ఆడతా పాడతా పిల్లోడు లేగదూడలాగా గెంతులేసేవోడు. ఇస్కూలు కెలతా ఉండేవోడు. మాయదారి జబ్బు చేసింది... ఇదిగో కాళ్లూసేతులూ సచ్చుబడి యిట్టా మంచంలో తీసుకుంటున్నాడు. అన్నీ మంచంలోనే. అవిటి బతుకు. ఆకలైతుందని గూడా అడగడు. పెడితే తింటాడు, లేకపోతే లేదు. ఒంట్లూ, ఎక్కాలూ, పాటాలు గడగడా ఒప్పజెప్పేటోడు... యియ్యాల మైండు సరిగ్గా లేక పిచ్చి చూపులు జూస్తున్నాడు. దినామూ కూలీకిబోతే తప్ప పొట్ట గడవదు. పెద్ద పెద్ద దవాఖాన్లకు బోవాల్నంటే మా తరమైతదా?"

ప్రకృతిలో ఏం వుంటాయ్ మైడియర్ వెంకటేశం? గిరిజన తండాలుండును. అవును... అంత ఇంటిలిజెంటు గిరీశం కూడా తండాలను విస్మరించాడేమిటీ. గిరిశం కాదు... గురజాడ! కాదు నాగరిక సమాజం... కాదు కాదు... ప్రభుత్వం. తండాలను తగలబెట్టండి. తండాలను వెలివేయండి. అక్కడ పుట్టే ఆడపిల్లల్ని మాత్రం కొనేద్దాం... ఖండాంతరాలకు తరలిద్దాం... భలే మంచి చౌకబేరమూ... లలలా... పెట్టుబడి లేని వ్యాపారమూ... భలే మంచి...

"ఇది కోటినాయక్ తండా, నా పేరు వాంకుడోతు వాసునాయక్. ఈ అమ్మి నా బిడ్డ సీలి. సర్కారు ఇస్కూళ్ల ఏడో తరగతి సదువుతాంది. సెలవులకని ఇంటికొచ్చి వుండగా మెదడువాపు వ్యాధి వచ్చె. ఎమ్మట్నే దవఖానకు తీస్కెల్లిన. ఆడ నయంకాలే. పట్నం తీస్కపోయిన- ఏవేవో చేసిన్రు. ఈ పోరంటే నాకు పేనం. డబ్బుకోసం ఆలోసించలే. అందినకాడికి అప్పుదెచ్చిన. అరవయ్యేలు అప్పు తేలిందిగానీ, పోరి కోలుకోలే. ఎర్రగా బుర్రగా ఎంతందంగా ఉండేదో! అయిదు అయిపోయినంక అదేదో పరిచ్చ రాసింది. జిల్లాల ఫస్టు వచ్చిం

దని సర్కారోల్లే పెద్ద బళ్లెకు తీసుకున్నరు. ఇయ్యాల మతి లేకుంట ఇంట్లపడి వుంటంది.''

ప్రియమైన గిరిజనుడా?... ఏడవకు! పొరపాటున హైటెక్ అధికారులెవరైనా ఇటుగా వస్తే వాళ్లూ కన్నీరు కార్చే ప్రమాదముంది.

*

అర్జెంటుగా టీ తాగాలి. లేకుంటే నాలుకవాపు వ్యాధి వచ్చేయ్యగలదు. ఒక్క హోటలైనా కనిపించదు. దీన్ని మండల కేంద్రంగా మార్చినవాణ్ణి చెప్పుకోవాలి. ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్తే బెటర్... ఈ ఊళ్లో మెదడువాపు కేసులెన్నో ఇట్టే తెలిసిపోతుంది.

కొట్టుకుంటున్నారు... కొట్టుకుంటున్నారు. జనం గుంపు. ఆగండాగండి. ఏం జరిగింది? వీపులకు ట్యాంక్‌లు తగిలించుకొని, బిక్క మొహాలేసిన ఆ నలుగురిలో 'బతుకు జీవుడా' భావం! జనంలో అసహనం. ''యాభై ఇళ్లకే బైటెక్స్ మందుకొట్టి ఉడాయిస్తున్నారు భడవలు. మావి మాత్రం ఇళ్లు కాదా! మాకు లేదా దోమల బెడద?''

''మేమేం చెయ్యగలం? అయ్యగారు అంత వరకే ఇచ్చారు మాకు...'' బిక్కమొహాల సమాధానాలు.

పిల్లవాండ్రకు చాలు పప్పుబెల్లాలు... అయ్యవారికి చాలు అన్ని పథకాల నిధులు...

భళ్లున వాంతి, వొద్దు... చూడొద్దు ఆ దృశ్యాన్ని రెండొందల దాకా ఉంటాయా? పైనే ఉండొచ్చు. బాప్‌రే! ఎవడ్రా ఆ రోగ్? విషం పెట్టి పందుల్ని చంపి అలా గుట్టలా పడేసిపోయాడు? రాస్కెల్... అంతకన్నా వాటిని చంపకపోతేనే బాగుండేది. గ్రామస్థులారా... పారిపోండి పారిపోండి... ఇక్కడ జపనీస్ ఎన్‌సెఫలైటీస్ వైరస్ గుట్టలు గుట్టలుగా పడి వుంది. ఆలస్యం చేశారో... మీ పిల్లల శవాలూ ఇలాగే గుట్టలు గుట్టలుగా లేస్తాయి.

అహో! ఎవరచ్చట? అటెండరుగారూ... అటెండరుగారూ.. ఎమ్మార్వోగారు లేరా? షిట్... మూడో శనివారం... క్లీన్ అండ్ గ్రీన్... క్లీన్ అండ్ గ్రీన్.. డామిట్! ఎక్కడ చచ్చార్రా క్లీనింగ్‌గాళ్లూ... అక్కడ పందుల గుట్టలు కనిపించటం లేదూ? అక్కడిదాకా ఎందుకు మీ ఆఫీస్ చుట్టూ ఈ రొచ్చుగుంట సంగతేమిటి?

125 కిలోమీటర్లు తిరిగాను. ఎక్కడ్రా మురిక్కాల్వలు శుభ్రమైందీ? కంపు. ముక్కులు చెక్కలయ్యే కంపు... మంచినీటి బోర్ల చుట్టూ మురికినీటి కాల్వలు... ప్రధాన రహదారుల పక్కనే చెత్తాచెదారపు గుట్టలు. వీధుల్లో పందుల స్వైరవిహారం.. ఎక్కడన్నా ఫినాయిల్ వాసన వస్తే ఒట్టు! బైటెక్స్ కొట్టిన జాడ కనిపిస్తే పాపం!

అమ్ముకుంటున్నారు... అమ్ముకుంటున్నారు... మున్సిపాలిటీల దగ్గర్నుంచీ మండల పరిషత్తు కార్యాలయాల దాకా... ఎన్ని రకాలు ప్రభుత్వం నుంచి వస్తున్నాయ్? ఎన్ని సద్వినియోగమవుతున్నాయ్? ప్రజారోగ్యం నిధులు ఎవడి కడుపులో దాక్కుంటున్నాయ్?

తియ్యొద్దు. లెక్కలు తీశావో నీ తల వేయివక్కలగునుగాక! తియ్యాల్సిందే. తాట తియ్యాల్సిందే... చూద్దాం అసలు కలం పవరేమిటో చూపిద్దాం. ఎవడి కోసం చూపిస్తారు లెక్కలు? మింగిందంతా కక్కిస్తా!

ఈ డాక్టర్లొకరు- పనికిరాని వాదన! బెల్లడోనాలో నిరోధక మంత్రం లేదని ఒకరు... ఉందని ఒకరు. అసలు నివారణ మార్గమేమిటి? ఊరికే పోసుకోలు కబుర్లూ మీరు.

మూడేళ్ల నుంచీ వరసగా పరీక్షల కోసమని వ్యాధి బాధితుల నుంచి రక్తం తీసుకెళ్తున్నారు. బాతులూ కొంగల రక్తాన్ని పట్టుకెళ్తున్నారు. వాటి రిజల్టు ఇంత వరకూ రాలేదు.

వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో యాంటిజెన్ ఎక్కడ ఏడ్చింది? శాంపిల్స్ తీసుకెళ్లి వ్యాధి నిర్ధారణకు మూణ్రోజులు తీసుకుంటే అందులో ప్రామాణికత ఏమిటి నా బొంద? వైరస్‌లు అచేతనమైన నిర్జీవ రక్తకణాలు ఏం చెబుతాయి?

అణ్వాయుధాలు కాదురా... మెదడువాపు వ్యాధి నిరోధక మందులు కనుగొను. ఇంటర్నెట్ల రహస్యాలు కాదురా... ఇంటింటా పరిశుభ్రత తాండవించే ప్రణాళికలు తయారుచెయ్యి. అప్పటిదాకా నిరోధక మందుల పనితీరుపై వాదనలు మానెయ్. ఉన్నదాన్నే వాడుకుందాం 'బెల్లడోనా' యే బెల్లం... తప్పదు.

*

వరస కథనాల పరంపర. ఇన్వెస్టిగేటివ్ వార్తల తుఫాను. ప్రభుత్వ వైఫల్యం పై కన్నెర్ర.

కదులుతున్నాయ్... పునాదుల్లో చలనం ప్రారంభం...

''ఇంటింటికీ బెల్లడోనా మందు పంపిణీ.''

''సస్పెన్షనూ... నిధుల రికవరీలు.''

''మంచమే ఆ చిన్నారుల ప్రపంచం.''

...హ్యూమన్ ఇంట్రెస్ట్ స్టోరీకి ప్రతిస్పందన. అంగవికలురైన బాలలకు ప్రభుత్వ సాయం...

''పారిశుద్ధ్యం నిధుల గోల్‌మాల్.''

....ఎంక్వైరీలు... నివేదికల సమర్పణలూ...

“ప్రభుత్వ కార్యాలయాలా? మురికివాడలా?”

...మాయం మాయం... కార్యాలయాల చుట్టూ మురుగు మాయం... తిరుగాడే పందులు మాయం... చెత్తా చెదారం మాయం.

“ఆస్పత్రి సిబ్బందికి అవినీతి జబ్బు.”

...తిక్క కుదుర్తోంది. లేకుంటే జలగల్లా, జనం పాలిటి యమభటుల్లా వ్యవహరిస్తారా... ఖబడ్దార్!

“బహిరంగ మార్కెట్లో సర్కారు మందులు.”

...పేలింది... ఆధారాలతో సహా తాంబూలా లిచ్చాను. తన్నుకు చావండి.

...దాడులు. మెడికల్ షాపులపై పోలీసుల దాడులు. ఆరోగ్యశాఖాధికారుల దాడులు, ఆకస్మిక తనిఖీలు. ఒళ్లు విరుచుకున్న విజిలెన్స్ ఆఫీసర్లు!

ట్రింగ్... ట్రింగ్...

“హల్లో... కాస్త తగ్గమ్మా. అలా చంకలు గుద్దు కోకు. నీ వార్తలు ఎందరికి వరాలయ్యామో తెలుసా?

“తనిఖీల కొచ్చిన అధికారుల జేబులు బలిసి పోతున్నాయ్. ఎమ్మార్వోలు తమ పాప పరిహారార్థం ఆర్డీవోలకు చదివింపులు సమర్పించుకొంటున్నారు. ఊళ్లు పంచుకుంటున్న సర్పంచులు ‘క్లీన్ అండ్ గ్రీన్’ సర్టిఫికెట్ నిమిత్తం పై అధికారులకు మొక్కు చెల్లించు కుంటున్నారు. విజిలెన్స్ అధికారులకైతే పండగే. పోలీసు స్టేషన్లోనైతే ఏకంగా నీ ఫోటోనే పెట్టుకుని పూజిస్తు న్నారు. ఎందుకేమిటీ? ఎంచక్కా మెడికల్ షాపులపై దాడుల పేరుతో దండుకుంటున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉండాల్సిన మందులు నాలుగు మెడికల్ షాపుల్లో అమ్ముతున్నారని తాంబూలాలు ఇచ్చావుగా... రాత్రంతా ‘బేరం’ పై చర్చలు నడిచాయి. ఆ నలుగురూ కలిసి ఎస్పైగారికి రెండు లక్షలిచ్చారు. కేసు నమోదు చేసి, నీ కన్నీళ్లు తుడిచి, వాళ్లను సకల మర్యాదలతో వదిలేశాడు.”

స్టాప్... స్టాప్... ఎవడీ ఆకాశఫోనన్న? తిట్టొద్దు... ఆలోచించు... నిజమేనేమో... ఏమో కాదు... నిజమే!

లాభంలేదు. లాఠీలపైనా కలం ఝుళిపించా ల్సిందే.

“సర్కారు మందుల కేసులో పోలీసుల చేతి వాటం.”

హమ్మయ్య, ప్రశాంతంగా ఉంది. ఈ రాత్రి ఇక హాయిగా నిద్రపోవచ్చు.....

“ట్రింగ్... ట్రింగ్...”

“హలో... హలో... అవున్నేనే. మీరెంత దయార్ద్ర హృదయులండీ! ఎంతమందిని అర్థాంతరంగా ‘వేలాధి కారుల్ని’ చేస్తున్నారో! పోలీసుల్ని బెదిరిస్తూ వార్త రాశారు. మిగతా విలేఖర్లకు ప్రాణం పోశారు. వాళ్లంతా ఇప్పుడు పోలీసుల్తో సమావేశమయ్యారు. ‘మా పరిశోధనలో మీ బొక్కలు మరిన్ని బయటపడ్డాయి. రేపట్నించీ సీరియల్ గా ఇస్తాం,’ అంటూ బేరం పెట్టారు. ఎక్కడి నుంచే మిటి? ఆ ‘బేరం సమావేశం’ దగ్గర్నుంచే మాట్లాడు తున్నా. ఎస్పై ఎందుకు బేరానికి వచ్చాడో తెలుసా? బృందంలో మీ పత్రిక టౌన్ విలేఖరి కూడా ఉన్నాడు కాబట్టి. లేకపోతే రాబందులు మింగేవాడు... వాడు దిగి రావడమేమిటి?”

బుర్రలో మురిక్కాలవ హోరు. కాలవ పాయలు పాయలుగా చీలుతోంది. శరీరావయవాలన్నిటికీ ప్రవహిస్తోంది. కంపు... భరించలేని దుర్గంధం. గ్రామా ల్లోంచీ... పోలీస్టేషన్లోంచీ... మున్సిపల్ కార్యాలయం లోంచీ... ఎమ్మార్వో ఆఫీస్‌లోంచీ... వీధుల్లోంచీ, వీధుల పక్క మెడికల్ షాపుల్లోంచీ... ఒక ఉప్పెన. కుళ్లి కంపు కొడుతున్న ప్రవాహాల సంగమంతో ఇంట్లోకీ, ఇంట్లోంచీ వంట్లోకీ ప్రవహిస్తోంది... కంపు కంపు... అసలింతకీ మెదడువాపు వ్యాధిని కలిగించే కారకమేదీ?

*రచన దీపావళి ప్రత్యేక సంచిక, అక్టోబర్ 2000*